# జేఎన్‌టీయూ వీసీతో అలుమ్ని డైరెక్టర్ భేటీ



వీసీ టీకేకే రెడ్డితో మాట్లాడుతున్న వర్సిటీ అమెరికా అలుమ్ని డైరెక్టర్ బస్వశేఖర్ శంషాబాద్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ హెచ్ అమెరికా అలుమ్ని డైరెక్టర్ బస్వశేఖర్ శంషాబాద్ బుధవారం వీసీ టి. కిషన్‌కుమార్‌రెడ్డితో భేటీ అయ్యారు. అలుమ్ని కార్యక్రమాలు, విద్యార్థులకు అందిస్తున్న మద్దతు, ఇంటర్న్‌షిప్‌లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ సూచన మేరకు సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, అలుమ్ని, ఇతర సంస్థల నుంచి సీఎస్ఆర్ కింద అందించాల్సిన సహకారం తదితర అంశాలపై ప్రిన్సిపల్ డాక్టర్ నర్సింహతో సమావేశమయ్యారు. సుల్తాన్‌పూర్ కళాశాలకు వంద కంప్యూటర్లు, స్మార్ట్ బోర్డులు, వ్యాయామశాల ఏర్పాటు, మైదానం అభివృద్ధి, బాస్కెట్‌బాల్, టెన్నిస్ కోర్టుల నిర్మాణం, 56సీటర్ బస్సు తదితరాలను సమకూర్చే విషయాలపై చర్చించారు. అలుమ్ని నుంచి సుల్తాన్‌పూర్ కళాశాలకు సహకారం అందించే దిశగా ఈ కసరత్తు చేపట్టినట్లు బస్వశేఖర్ చెప్పారు. ఒకసారి క్యాంపస్‌ను కూడా సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అలూమ్ని డైరెక్టర్ డా. జె. సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఫుట్‌వేర్ డిజైనింగ్‌లో కొత్త మెళకువలు

## ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫుట్‌వేర్ డిజైనింగ్‌లో ఆధునిక సాంకేతికత తీసుకొచ్చేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ ఎస్.తేజ్‌లోహిత్ రెడ్డి బుధవారం మండలి కార్యాలయంలో బాలకిష్టారెడ్డితో చర్చించారు. స్కూల్, కాలేజీ స్థాయిలో సరికొత్త డిజైన్ల తయారీకి తమ సంస్థ తోడ్పాటునిస్తోందని లోహిత్ రెడ్డి తెలిపారు. యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించే ఈ కోర్సులను విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలని ఉన్నత విద్యా మండలిని కోరారు.

# ఎప్‌సెట్‌కు 48,158 దరఖాస్తులు

## • కన్వీనర్ డీన్‌కుమార్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 48,158 మంది దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 31,805 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 16,317 మంది రెండింటికీ 36 మంది కలిపి మొత్తం 48,158 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వచ్చేనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుంతో ఆదేనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం **https://eapcet.tgche.ac.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# టీజీ ఎప్‌సెట్‌కు 50వేల మంది దరఖాస్తు

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షలకు ఇప్పటివరకు 50 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు పరీక్షల కన్వీనర్ డాక్టర్ డీన్ కుమార్ తెలిపారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి 31,805, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 16,317, రెండు విభాగాలకు కలిపి 36,48,158 మంది ఆన్‌లైన్‌లో బుధవారం సాయంత్రం నాటికి దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కాగా ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ, మే 2 నుంచి 5 వరకు ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి.

గురువారం 6 మార్చి 2025 ఆంధ్రజ్యోతి

# పరిశోధనలకు ప్రాధాన్యం ఏదీ!

- ఈ ఏడాది పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయని జేఎన్‌టీయూ అధికారులు
- అడ్మిషన్ల విభాగం చుట్టూ ఆశావహ అభ్యర్థుల చక్కర్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్‌కు చిరునామాగా నిలిచిన జేఎన్‌టీయూలో పరిశోధనలకు ప్రాధాన్యం లభిస్తుందా అంటే.. విద్యార్థి వర్గాల నుంచి లేదనే జవాబు వస్తోంది. ప్రతియేటా పీహెచ్‌డీ నోటిఫికేషన్ జారీచేయడంలో అడ్మిషన్ల విభాగం అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గతేడాది (2024) జనవరిలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇవ్వగా, నిన్న మొన్నటి వరకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాక పోవడంతో 40శాతం పైగా సీట్లు మిగిలిపోయాయి. మొత్తం 1,081మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వివిధ దశల్లో జాప్యం కారణంగా వందలాది మంది అభ్యర్థులు ప్రైవేటు యూనివర్సిటీల బాట పట్టారు. ఓవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులను విశ్వవిద్యాలయాలు ప్రోత్సహించాలని చెబుతున్నా, జేఎన్‌టీయూ అధికారులు మాత్రం పెడచెవిన పెడుతున్నారని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.



> పీహెచ్‌డీ నోటిఫికేషన్లను జారీచేయడంలో జేఎన్‌టీయూ అడ్మిషన్ల విభాగం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గత ఏడాది జనవరిలో నోటిఫికేషన్ ఇవ్వగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇవ్వకపోవడంపై విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### నోటిఫికేషన్ ఎప్పుడిస్తారు?

పీహెచ్‌డీ ప్రవేశాల నిమిత్తం ఈ ఏడాది నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేస్తారో ఎవరికీ అంతుపట్టడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కోర్సు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ అడ్మిషన్ల కోసమని ఎదురుచూస్తున్న పలువురు అభ్యర్థులు నోటిఫికేషన్ ఎప్పుడిస్తారంటూ అడ్మిషన్ల విభాగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల వైస్‌చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌కుమార్‌రెడ్డి.. తాజాగా ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో జరిపిన భేటీలో రీసెర్చ్ సెంటర్లకు పీహెచ్‌డీ సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ, నోటిఫికేషన్ జారీపై ఆర్‌అండ్‌డీ, అడ్మిషన్ల విభాగం నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతో ఆశావహ అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెంటనే జారీచేయాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు వీసీని కోరుతున్నారు.

### టీసీలు, పే స్లిప్పుల పేరుతో వేధించొద్దు

గతేడాది పీహెచ్‌డీ ప్రవేశపరీక్ష రాసి అర్హత సాధించిన అభ్యర్థులను ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు(టీసీ), ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు వేతన స్లిప్పులు కావాలంటూ అడ్మిషన్ల విభాగం అధికారులు అర్థంపర్థం లేని నిబంధనలు పెట్టడంతో పదుల సంఖ్యలో అభ్యర్థులు ఇంటర్వ్యూలకు దూరమయ్యారు. కొన్ని విద్యార్థి సంఘాల నుంచి టీసీలు, పేస్లిప్పుల గురించి తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం కావడంతో వెనక్కి తగ్గిన అధికారులు కొద్దిమందికి టీసీలు, పేస్లిప్పులు లేకున్నా ఇంటర్వ్యూలకు అనుమతించారు. విద్యార్థులను వేధింపులకు గురిచేసే నిబంధనలను తొలగించాలని కోరుతున్నారు. అడ్మిషన్ల సమయంలో టీసీలు కావాల్సిందేనని పట్టుపడుతున్న వర్సిటీ అధికారులు, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి టీసీలు ఇచ్చేందుకు ససేమిరా అంటుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియలో అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై వీసీ కిషన్‌కుమార్ రెడ్డి దృష్టి సారించాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గోల్డెన్ జూబ్లీ భవనం సందర్శన

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవనాన్ని బుధవారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి సందర్శించారు. భవనం నిర్మాణానికి వెచ్చించిన నిధులు, భవనంలో నిర్మాణం చేసిన గదులు, హాల్స్ తదితరాలను పరిశీలించారు. ప్రారంభం, వినియోగం అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.